క్లుప్తంగా

శోభాయమానంగా శకటోత్సవం



ఆంజనేయస్వామి దేవాలయం చుట్టూ కొనసాగుతున్న శకటోత్సవం

కుల్కచర్ల: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం శకటోత్సవం శోభాయమానంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి పంటలు బాగా పండాలని రైతులు సుభిక్షంగా ఉండాలని, దిగుబడి అధికంగా రావాలని కోరారు.

ధారూరులో టగ్ ఆఫ్ వార్



ధారూరు: ఉగాది సందర్భంగా ధారూరు మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్ అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం టగ్ ఆఫ్ వార్ నిర్వహించారు. ఒక్కో గ్రూప్‌లో 10మంది సభ్యులున్న 10 గ్రూపులు పాల్గొన్నాయి. ఇందులో సాయన్న టీం మొదటి బహుమతి రూ.1,000 షీల్డ్‌ను సాధించగా, ధారూరు రైతు సంఘం టీం రెండో బహుమతిగా రూ.750 షీల్డ్ దక్కించుకుంది. విజేతలకు సీనియర్ న్యాయవాది సంపూర్ణ ఆనంద్‌రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎల్ అశోక్ తదితరులు బహుమతులు అందజేశారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో చంద్రయ్య తదితరులు

పరిగి: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రయ్య పేర్కొన్నారు. ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అన్ని మతాలను గౌరవించాలన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో ప్రజలు సోదరభావంతో మెలుగుతున్నారన్నారు. కులమతాలకు అతీతంగా అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గాలు



ఈద్గా వద్ద ముస్లిం పెద్దలు

అనంతగిరి: నెల రోజులుగా కొనసాగిన రంజాన్ మాసం సోమవారంతో ముగియనుండడంతో ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు. ఈ ప్రార్థనలకు ఈద్గాలను సిద్ధం చేశారు. అక్కడ శుభ్రం చేయడంతో పాటు టెంట్లు వేశారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి

పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్

చేవెళ్ల: విద్యాసంస్థలకు సంబంధించిన భూములను అమ్మడం అనేది విద్యావ్యవస్థ పతనానికి దారి తీసినట్లేనని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ అన్నారు. చేవెళ్లలో ఆదివారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూముల అమ్మకానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసు దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌సీయూ భూముల వేలాన్ని వెంటనే ఆపాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు జేసీబీలను అడ్డుకునే ప్రయత్నాలు చేశారన్నారు. అడ్డుకున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులను పోలీసులు అరెస్టులు చేసినట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన విద్యార్థులను విద్యార్థి సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూముల అమ్మకాలకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు అన్ని ఏకమైన పోరాటం చేయాలన్నారు.



కొడంగల్: పంచాంగం వినిపిస్తున్న శ్రీనివాసాచార్యులు



అనంతగిరి: వికారాబాద్‌లోని రామమందిరంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు కృష్ణ పంతులు



పూడూరు: ఎన్కేపల్లిలో పంచాంగ శ్రవణం



మర్పల్లిలో పంచంగ పఠనం చేస్తున్న పూజారి కైలాస్‌నాథ్ జ్యోషి

షడ్రుచుల సమ్మేళనం

తెలుగు నూతన సంవత్సరం ఉగాది వేడుకలను ఆదివారం ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడిని తయారు చేసుకుని ఆరగించారు. ఆయా గ్రామాల్లోని పలు దేవాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త సంవత్సరం ఆనందోత్సవాల మధ్య గడవాలని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో ఏర్పాటు చేసిన పంచాగ శ్రవణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విశ్వవసు నామ సంవత్సరం రైతులకు ప్రతికూలంగా ఉంటుందని పండితులు వెల్లడించారు. కొత్త సంవత్సరంలో తమతమ పేర్ల మీద ఉన్న బలాబలాలు, మంచి, చెడులు, విద్యా, ఉద్యోగం, ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానం తదితర విషయాలను పంచాంగ కర్తలతో చెప్పించుకున్నారు.



పరిగిలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు తదితరులు



కుల్కచర్లలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పూజారి పాండురంగయ్య



బంట్వారం: కోట్‌పల్లిలో పంచాంగ శ్రవణం



తాండూరులో బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం



దుద్యాల్: హస్నాబాద్‌లో పంచాంగ శ్రవణం చేస్తున్న అనంతసేనా చారి



మోమిన్‌పేటలోని ఎన్కేపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో..



ధారూరు: ఆంజనేయస్వామి దేవాలయంలో..



దుద్యాల్‌లో జడకొప్పు ఆడుతున్న యువకులు, చిన్నారులు, మహిళలు



దౌల్తాబాద్‌లో పంచాంగ చదివి వినిపిస్తున్న పండితులు



యాలాల: హాజీపూర్‌లో పంచాంగ శ్రవణం



కొడంగల్ రూరల్: పంచాంగ పఠనం చేస్తున్న పట్టణ పురోహితుడు కిట్టుస్వామి

క్రీడలతో మానసికోల్లాసం



టీషర్టులు పంపిణీ చేస్తున్న నాయకులు

కుల్కచర్ల: క్రీడలతో వ్యక్తిత్వవికాసం, మానసికోల్లాసం పెరుగుతుందని మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉగాది సందర్భంగా కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న టోర్నీలో నిర్వాహక జట్టుకు గ్రామానికి చెందిన నాయకులు కృష్ణయ్య, శ్రీశైలం టీషర్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ రెడ్డి, శ్రీనివాస్, ఎం.శ్రీను, నర్సింలు, రాము, ఊరడి శ్రీను, ఊరడి రాజు, సాయి, నర్సయ్య, మైపాల్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో కవి సమ్మేళనం



అనంతగిరి: మల్లికార్జున భవనంలో కవి సమ్మేళనం చేపడుతున్న వేదపండితుడు సాంబశివశర్మ

అనంతగిరి: ఉగాది పండుగతో ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆనందోత్సవాలు నింపి వారి పనుల్లో విజయం చేకూరాలని, కొత్త ఆలోచనలతో అన్ని రంగాల్లో రాణించాలని సాహితి సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు, ప్రముఖ వేదపండితులు సాంబశివశర్మ ఆకాంక్షించారు. ఆదివారం ఉగాది పురస్కరించుకుని సాహితి సమితి ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని మల్లికార్జున భవనంలో సాయంత్రం పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు బస్వరాజు పంతులు పంచాంగ విశేషాలు వివరించారు. అనంతరం వేద పండితులు సాంబశివశర్మ ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో సమకాలీన అంశాలతో కూడిన కవితలు, పద్యాలు, పాటలు పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో సాహితి సమితి జిల్లా అధ్యక్షుడు వీరకాంతం, మల్లికార్జున భవనం నిర్వాహకులు డాక్టర్ భక్తవత్సలం, సాహితి సమితి ప్రతినిధులు కృష్ణగౌడ్, వెంకటయ్య, సభ్యులు, పుర ప్రముఖులు, కవులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు టౌన్‌లో..

తాండూరు టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తాండూరు సాహితి సమితి, హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వరసిద్ధి వినాయక దేవాలయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. పలువురు కవులు హాజరై ఉగాది ప్రాధాన్యత, పద్యాలు, కవితలు వినిపించారు. అనంతరం సిద్ధి లింగయ్య స్వామి ఉగాది పంచాంగాన్ని పఠించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, సభాధ్యక్షుడు ఆలంపల్లి రాంరెడ్డి. హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నరహరి రెడ్డి, కార్యదర్శి రవికాంత్, సాహితీ సమితి అధ్యక్షుడు వాసు తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు దోహదం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సేవాసమితి సభ్యులు

చేవెళ్ల: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం చేస్తాయని సత్యసాయి సేవా సమితి చేవెళ్ల శాఖ కన్వీనర్ రామగౌడ్ అన్నారు. మున్సిపాలిటీలోని బస్‌స్టేషన్ ఎదుట ఆదివారం సత్యసాయి సేవా సమితి చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులుమాట్లాడుతూ.. ప్రతి ఏడాది సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మానవ సేవే మాధవ సేవ అని సత్యసాయి చూపించిన మార్గం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన చూపించిన మార్గంలోనే సేవాసమితి నడుస్తోందని చెప్పారు. వేసవి కాలం ముగిసే వరకు ఈ చలివేంద్రం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు గోపాలచారి, విజయ్‌భాస్కర్, దివాకర్‌రెడ్డి, వెంకటేశ్, అంజనేయులు, మధు, ప్రభు, విఠల్, దేవేంద్రచారి, శంకరయ్య, మాధవరెడ్డి, పెంటారెడ్డి ఉన్నారు.

బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

దౌల్తాబాద్: ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న మంత్రి వర్గ విస్తరణలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ బీసీ నేత బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని జిల్లా కురుమసంఘం కార్యదర్శి నాగప్ప ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మంత్రి వర్గ విస్తరణలో కురుమలకు సముచితం స్థానం కల్పించాలని సూచించారు.

పరమ శివుడుగా దర్శనమిచ్చిన శివలింగం

తాండూరు: తాండూరు పట్టణంలోని బావిగి భద్రేశ్వరస్వామి దేవాలయంలోని శివాలయంలో ఆదివారం స్వామివారు పరమశివుడి అలంకరణలో భక్తులకు దర్శనమించారు. ఆలయ అర్చకులు విజయ్‌కుమార్ స్వామివారికి ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పరమశివుడి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థి దశ నుంచి సేవాగుణం అలవర్చుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ పేర్కొన్నారు. వారం రోజులుగా హైదరాబాద్ దోమలగూడలోని ఏవీ కళాశాల విద్యార్థులు నక్కలపల్లిలో వారంరోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ వేసవి ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఆదివారంతో ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ సభను ప్రోగ్రామ్ అధికారి అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరీ సతీశ్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడే విజ్ఞానం పెంపొందుతుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ అనేది విద్యార్థులకు ఒక చక్కటి అవకాశం అన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. దేవాలయ ప్రాంగణం శుభ్రత, రోడ్లకు ఉన్న చెట్లకు పాదులు, విద్యా, ఉద్యోగం సంబంధిత ఇంటింటి సర్వే, సామాజిక సమస్యలపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించినందుకు అభినందించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నిరంజన్‌గౌడ్, నీలకంఠం, అంజయ్యగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజుగౌడ్, గ్రామస్తులు, యువకులు, నాయకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్

షాద్‌నగర్: మున్సిపాలిటీలో ఆస్తి పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ సునీత ఓ ప్రకటనలో తెలిపారు. రంజాన్ పర్వదినం పురస్కరించుకొని సోమవారం సెలవు ఉన్న నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆస్తి, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లు బకాయిలు ఉన్నవారు వెంటనే పన్నులు చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



మక్తవెంకటాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న నాయకులు

కుల్కచర్ల: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్పాటి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. మొదటి విడతలో భాగంగా 156మందికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, స్థానిక నాయకులు జె.వెంకట్, రామరావు, లాలు, రాథోడ్, సంతోష్, అభిరాం, మాసయ్య, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటుంది ఎవరు?

ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు గుల్షన్



మాట్లాడుతున్న గుల్షన్

కొడంగల్ రూరల్: కొడంగల్ అభివృద్ధిని ఎవరు అడ్డుకుంటున్నారని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి గుల్షన్ ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేశామని చెబుతున్నప్పటికీ అభివృద్ధి ఎక్కడ చేశారో చెప్పాలన్నారు. షాదీఖానాకు నిధులు మంజూరైనా పనులు ఎందుకు చేపట్టడంలేదని ఆయన ప్రశ్నించారు. అంబేడ్కర్ చౌరస్తా విస్తరిస్తామని ఎందుకు పనులు చేపట్టడంలేదన్నారు. మైనార్టీ అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమంటున్నా, పట్టణంలో ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థకు చేరిన షాదీఖానా భవన నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సమస్యలు గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.

వామ్మో.. కంపు!

- ఇళ్ల మధ్య పారుతున్న మురుగు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ వాసులు
- పట్టించుకోని అధికారులు



చెత్త చెదారంతో నిండిన కాల్వ

దుద్యాల్: మురుగు సమస్యతో మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా ఉన్న మత్స్యకార భవనం ఎదుట, ఇళ్ల మధ్య మురుగు చేరడంతో దుర్గంధం వాపిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు కాల్వ నుంచి కొట్టుకొచ్చిన మురుగు, చెత్త చెదారం నిండుకుపోవడంతో నాలుగు రోజులుగా దుర్వాసన వెదజల్లుతుంది. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో స్థానికులు ఇళ్లలో సైతం ఉండలేపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య మురుగు చేరడంతో, చెత్త నిల్వల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ఈ విషయంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జనావాసాల మధ్య చేరిన మురుగు నీరు